సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం ; 2 ; ఆగస్టు ; 2025



సాగర్ సోయగాలు
అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన సాగర్ జలాశయం నిండుకుండలా మారి సరికొత్త అందాలను సంతరించుకుంది. - 8లో



ప్రతీ ఎకరాకు సాగు నీరు
ఆలేరు నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. - 9లో



పల్లెకు రాని పల్లెవెలుగు
రామన్నపేట మండల పరిధిలోని పలు గ్రామాలకు బీటీ రోడ్లు ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు రావడం లేదు. - 9లో



హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని స్పీడ్ గన్‌తో రికార్డ్ చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

స్పీడ్ గన్ చూస్తోంది..

- ఎన్‌హెచ్-65పై ప్రమాదాల కట్టడికి చర్యలు
- గంటకు 90 కిలో మీటర్ల వేగం మించితే ఫైన్

చౌటుప్పల్ రూరల్: వాహనాలను అతివేగంతో నడపడం వల్ల చోదకులు ప్రమాదాలకు గురవడమే కాకుండా ఎదుటివారిని ఇబ్బందుల్లోకి నెడుతున్నారు.ఈ నేపథ్యంలో వాహనాల వేగ నియంత్రణపై పోలీసులు దృష్టి సారించారు. శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం పరిధిలో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై చెట్లమాటున స్పీడ్‌గన్‌లు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని రికార్డ్ చేశారు. పరిమితికి మించిన వేగంతో వెళ్తే వెంటనే వాహనదారుడి సెల్‌ఫోన్ లేదా, వాహనం నంబర్ ఆధారంగా ఎంత జరిమానా చెల్లించాలనే సమాచారం వస్తుంది. గంటకు 90 కి.మీ వేగం మించితే చలానా వస్తుందని చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ విజయ్‌మోహన్ తెలిపారు.

మాకొద్దు జీపీఓ కొలువు!

- మాతృసంస్థలోకి రావడానికి పూర్వ వీఆర్‌ఓలు, వీఆర్‌ఏల అనాసక్తి
- పరీక్షలకు 173 మందే హాజరు
- జిల్లాలో 318 రెవెన్యూ విలేజీలు
- ఒక్కొక్కరికి రెండు, మూడు గ్రామాలు కేటాయించే అవకాశం



భువనగిరిలో నిర్వహించిన జీపీఓల పరీక్షకు హాజరైన పూర్వ వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు (ఫైల్)

సాక్షి, యాదాద్రి : గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించే చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పాలనాధికారి(జీపీఓ) పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తోంది. కానీ, ఈ పోస్టులకు పూర్వపు వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు ఆసక్తి చూపడం లేదు. జీపీఓ పోస్టుల భర్తీకి రెండు దఫాలు పరీక్ష నిర్వహించిన 172 మంది మాత్రమే హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 318 రెవెన్యూ గ్రామాలున్నాయి. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారంతా విధుల్లో చేరితే ఒక్కొక్కరికి రెండు, మూడు గ్రామాలను కేటాయించే అవకాశం ఉంది.

సర్వీస్ లెక్కించకపోవడమేనా..
2020లో వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు కాగా.. వారిని ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గ్రామస్థాయిలో తిరిగి రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామ పాలన అధికారులను నియమించేందుకు కసరత్తు ప్రారంభించింది. వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను పరీక్ష ద్వారా గ్రామ పాలనాధికారులుగా నియమించేందుకు సంకల్పించింది. అయితే తమ పాత సర్వీస్ కోల్పోతామని పలువురు జీపీఓ పరీక్ష రాయడానికి ఆసక్తి చూపలేదు. తద్వారా పదోన్నతుల్లో వెనుకబడిపోతామన్న ఆందోళన వారిలో నెలకొంది. ఈ నేపథ్యంలో తిరిగి మాతృసంస్థలోకి రావడానికి సుముఖత చూపడం లేదు.

పరీక్షకు తక్కువ సంఖ్యలో హాజరు
జీపీఓ పోస్టుల భర్తీకి ప్రభుత్వం రెండుసార్లు పరీక్ష నిర్వహించింది. తొలిసారి మే 25న నిర్వహించిన పరీక్షకు 151 మంది దరఖాస్తు చేసుకోగా 139 మంది పరీక్ష రాశారు. అందులో 127 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులోనూ నలుగురు జీపీఓ ఉద్యోగంలో చేరడానికి ఇష్టం లేదని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో వీఆర్‌ఓలు 58, వీఆర్‌ఏలు 65 మంది ఉన్నారు. ఇక రెండవ సారి జూలై 27వ తేదీన నిర్వహించిన పరీక్షకు 37 మందికి గాను 34 మంది హాజరయ్యారు. ముగ్గురు హాజరు కాలేదు. పరీక్ష ఫలితాలు రావాల్సి ఉంది.

రెండు,మూడు గ్రామాలు తప్పవా?
ఒక్కో రెవెన్యూ గ్రామానికి ఒక పాలనాధికారిని నియమించాలన్నది ప్రభుత్వ నిర్ణయం. జిల్లాలో 318 రెవెన్యూ గ్రామాలున్నాయి. పూర్వ వీఆర్‌ఓలు 181, వీఆర్‌ఏలు 526 మందికి 172 మంది మాత్రమే పరీక్ష రాశారు. ఒక్కొక్కరికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

సర్వీస్ కోల్పోతామన్న భయం
సర్వీస్ కోల్పోతామన్న భయంతో చాలామంది జీపీఓ పోస్టులపై ఆసక్తి కనబరచడం లేదు. ఈ కారణంగానే పరీక్ష రాయలేదు. మరోసారి పరీక్ష నిర్వహించాలని రెవెన్యూ మంత్రిని కోరాం. ఇప్పటికే నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు త్వరగా పోస్టింగ్ ఇవ్వాలి.
–గుర్రాల బాలకృష్ణ, పూర్వ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

న్యూస్‌రీల్

రూ.19.24 కోట్లు మాఫీ



వివరాలు వెల్లడిస్తున్న చేనేత, జౌళి శాఖ అధికారి

సాక్షి,యాదాద్రి : జిల్లాలో 2,380 చేనేత కార్మికులకు రూ.19.24 కోట్ల రుణమాఫీ కానుందని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో రుణమాఫీ జాబితాను అమోదించి రాష్ట్ర కమిటీకి నివేదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2017 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు రుణాలు తీసుకున్న చేనేత కార్మికుల ఆధారంగా జాబితా రూపొందించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 39 బ్యాంకుల్లో 2,380 మంది కార్మికులు రుణాలు పొందారని వెల్లడించారు. సమావేశంలో ఆర్‌డీడీ పద్మ, లీడ్‌బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ జిల్లా ఇంచార్జ్ అధికారిగా సాహితి



ఉత్తర్వులు అందుకుంటున్న సాహితి

భువనగిరిటౌన్ : ఉపాధి కల్పన జిల్లా అధికారి సాహితి బీసీ సంక్షేమ జిల్లా ఇంచార్జ్ అధికారిగా నియమితులయ్యారు. బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి యాదయ్య ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో సాహితికి శుక్రవారం ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ బాధ్యతలు కూడా నిర్వహించనున్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ప్రగతిచక్ర అవార్డులు

రామగిరి (నల్లగొండ) : విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ఆర్టీసీ సిబ్బందికి రీజియన్ స్థాయిలో ఏప్రిల్, మే, జూన్ నెలల ప్రగతిచక్ర అవార్డులను ఆర్‌ఎం జానిరెడ్డి శుక్రవారం నల్లగొండలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహిస్తేనే ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుందన్నారు. రీజియన్ పరిధిలో 28 మంది సిబ్బందికి ప్రగతిచక్ర అవార్డులతో పాటు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం, అన్ని డిపోల మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ లా గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: 2025-26 విద్యా సంవత్సరానికి గాను అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ శిక్షణకు బీసీ న్యాయవాద గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల వయసు 24 నుంచి 35 సంవత్సరాలలోపు ఉండాలని, గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఆగస్టు 15లోగా దరఖాస్తులను జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కొత్త కార్డులకూ పథకాలు

ఉచిత గృహ విద్యుత్, సబ్సిడీ గ్యాస్ వర్తింపు

- దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు
- మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు
- గతంలో దరఖాస్తు చేసుకోనివారికీ అవకాశం



దరఖాస్తుల స్వీకరణకు భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్

భువనగిరిటౌన్ : కొత్త రేషన్‌కార్డులు పొందిన వారికి సంక్షేమ పథకాలు వర్తించనున్నాయి. పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించింది. పదేళ్లుగా రేషన్ కార్డులు వరకు మంజూరు కాకపోవడంతో గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో వివిధ పథకాలకు చాలా మంది అర్హులు దూరమయ్యారు. ప్రస్తుతం రేషన్ కార్డులు మంజూరు చేస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. వీరితో పాటు గతంలో రేషన్ కార్డు కలిగి ఉండి పథకాలు పొందనివారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు మున్సిపల్ కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.



నూతనంగా 11,759 కార్డులు జారీ
ప్రజాపాలన గ్రామసభలు, మీ సేవ కేంద్రాలు ద్వారా 95,637 దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో విచారణ చేసినఅధికారులు 11,759 కార్డులు మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేశారు. అంతకుముందు 2,16,831 కార్డులు ఉన్నాయి. నూతనంగా మంజూరైన కార్డులు, గతంలో కార్డులు కలిగి పథకాలు అందని కుటుంబాలు దరఖాస్తు చేసుకునే ప్రభుత్వం అవకాశం కల్పించింది.

నూతన రేషన్ కార్డులు

మండలం	కార్డులు	మండలం	కార్డులు
ఆలేరు	971	భువనగిరి	573
ఆత్మకూర్	299	భువనగిరి టౌన్	598
ఐ.రామారం	300	బీబీనగర్	478
గుండాల	302	పోచంపల్లి	816
మోటకొండూరు	446	వలిగొండ	1418
తుర్కపల్లి	857	చౌటుప్పల్	540
రాజాపేట	558	నారాయణపురం	1168
యాదగిరిగుట్ట	881	రామన్నపేట	927
		అడ్డగూడూరు	72
		మోత్కూరు	555

లబ్ధిదారుల్లో ఆశలు
రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పలు పథకాలను అమలు చేసింది. వీటిలో ముఖ్యంగా మహాలక్ష్మి పథకంలో రూ.500కు వంట గ్యాస్, గృహజ్యోతిలో 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ వంటి వాటికి రేషన్‌కార్డు తప్పనిసరి చేసింది. దీంతో కార్డులేని కుటుంబాలు పథకాలు పొందలేకపోయాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ సమస్య తీరనుంది.



దరఖాస్తు విధానం ఇలా..
గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయాల్లో, పట్టణాల్లోని లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించాలి. సబ్సిడీ గ్యాస్ కోసం లబ్ధిదారులు తమ ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు జిరాక్స్‌లతో పాటు గ్యాస్ కనెక్షన్ ధ్రువీకరణ పత్రాలను కౌంటర్లలో సమర్పించాలి. దరఖాస్తు సంఖ్యను ప్రజా పరిపాలనలో కూడా కలిగి ఉండాలి. అప్పుడే పథకాలకు అర్హత పొందుతారు. కాగా ప్రస్తుతం వెబ్‌సైట్‌లో సబ్సిడీ గ్యాస్ ఆప్షన్ ఓపెన్ కావడం లేదని, గృహజ్యోతి పథకం ఆప్షన్ మాత్రమే సెలక్ట్ అవుతుందని అధికారులు చెబుతున్నారు.

తొలిరోజు 97శాతం ముఖ హాజరు

- పాఠశాలల్లో అమల్లోకి ఫేస్ రికగ్నిషన్ విధానం
- యాప్‌లో ఫొటో దిగి విధులకు హాజరైన ఉపాధ్యాయులు



తుక్కాపురం పాఠశాలలో సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసిన యాప్‌లో ఫొటో దిగుతున్న టీచర్లు

భువనగిరి: ఉపాధ్యాయుల హాజరులో పారదర్శకత కోసం రాష్ట్ర విద్యాశాఖ తీసుకువచ్చిన ఫేస్ రికగ్నిషన్ విధానం శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లోకి వచ్చింది. తొలిరోజు 97 శాతం మంది ఉపాధ్యాయులు యాప్‌లో ఫొటో దిగి హాజరు నమోదు చేశారు.

2,635 మంది రిజిస్ట్రేషన్
జిల్లాలో 670 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది 3,494 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 2,635 మంది ఉపాధ్యాయులు తమ వివరాలను ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా.. మొదటి రోజు అందరి హాజరు నమోదైంది. ఫేస్ రికగ్నిషన్‌కు ముందు తమకు కేటాయించిన యూజర్ పేరు, పాస్‌వర్డ్‌తో యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. జీపీఆర్‌ఎస్‌తో అనుసంధానం చేసినందున ఇది పాఠశాల ఆవరణలోనే సాధ్యమవుతుంది.

పలుచోట్ల సాంకేతిక సమస్యలు
మొదటి రోజు కావడంతో పలు పాఠశాలల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఉపాధ్యాయులు సంబంధిత నిపుణులను సంప్రదించి వెంటనే లోపాలను సరిదిద్దారు.

• శాఖాంబరిగా..



శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా భువనగిరి పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శాకాంబరి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

యాదగిరి క్షేత్రంలో స్వాతినక్షత్ర పూజలు



గిరి ప్రదక్షిణలో పూర్ణగిరి ఆలయ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ధర్మకర్తలు, అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం స్వాతినక్షత్ర పూజలు వేడుకగా చేపట్టారు. స్వామివారి జన్మనక్షత్రం కావడంతో భక్తులు, ఆలయ ఉద్యోగులు, అర్చకులు వేకువజామున గిరిప్రదక్షిణ చేశారు. ఇక అలయ ముఖ మండపంలో స్వాతి హోమంతో పాటు పంచామృతాలు, శుద్ధజలాలు, పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో నింపిన బంగారు, వెండి కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలకార మూర్తులకు అష్టోతర శతఘటాభిషేకం చేశారు. అదే విధంగా నిత్యారాధనలు కొనసాగాయి.

పూర్ణగిరిలో..
భువనగిరి: మండలంలోని నమాత్‌పల్లిలో గల పూర్ణగిరి శ్రీ సుదర్శన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రావి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీత్రిదండి రామానుజ చిన్నజీయర్‌స్వామి శిష్యులచే స్వామివారికి నవకలశ స్నపనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన దాత మొసలి ఉదయకుమార్‌రెడ్డి, ప్రధానార్చకులు పవన్‌కుమార్ శర్మ, ధర్మకర్తలు సురుపంగ పద్మ నరసింహ, ఎల్లంల జంగయ్య యాదవ్, బత్తిని సుధాకర్‌గౌడ్, పబ్బతి ఉప్పలయ్య, ఆలయ సేవకులు కంబాలపల్లి రఘునాథ్, కొత్తపల్లి నాగయ్య పాల్గొన్నారు.

ఏఐ తరగతులను ప్రారంభించాలి : డీఈఓ

రామన్నపేట: అందుబాటులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తరగతులు ప్రారంభించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ సూచించారు. శుక్రవారం రామన్నపేట మండలం ఇస్కిళ్లలోని గుండా సత్తయ్య మెమోరియల్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, బేస్‌లైన్ టెస్ట్ ఫలితాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.వలంటీర్ల సహకారంతో ప్రీప్రైమరీ తరగతులు, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం కక్కిరేణి, ఎన్నారం ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపేందర్‌జీ తదితరులు ఉన్నారు.



కక్కిరేణిలో విద్యార్థులకు పాఠం బోధిస్తున్న డీఈఓ

తప్పుడు పత్రాలపై విచారణ



లక్ష్మమ్మ ఇంటికి వెళ్లి విచారణ చేస్తున్న తహసీల్దార్ జ్యోతి

మోత్కూరు: తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కల్యాణలక్ష్మి పథకం ద్వారా లబ్ధిపొందిన ఘటనపై తహసీల్దార్ జ్యోతి శుక్రవారం విచారణ చేపట్టారు. మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి వెళ్లి వల్లపు సోమలక్ష్మమ్మ కుటుంబ సభ్యులను విచారణ చేశారు. లక్ష్మమ్మ కూతురు రాధిక వివాహం 2011లో వలిగొండ మండలం మొగిలిపాక గ్రామానికి చెందిన మర్ల మహేష్‌తో జరిగిందని, వారికి ఏడేళ్ల వయసున్న కుమారుడు, ఐదు సంవత్సరాల కుమార్తె ఉన్నట్లు విచారణలో తేలింది. తప్పుడు పత్రాలతో లబ్ధి పొందినట్లు రూ.1,00,116 లబ్ధి పొందినట్లు గుర్తించారు. లబ్ధిపొందిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఆదేశించినట్లు తహసీల్దార్ తెలిపారు.

అమ్మపాలు.. బిడ్డకు అమృతం

- తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం
- 7వ తేదీ వరకు కార్యక్రమాలు

భువనగిరిటౌన్ : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. మొదటి రోజు మోత్కూరు, గుండాల తదితర ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతపై అధికారులు అవగాహన కల్పించారు.



- 2న తల్లిపాల ఆవశ్యకతను తెలియజేసే పోస్టర్లు ప్రదర్శిస్తారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, ఉప కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తారు.
- 3న గ్రామ, వార్డుస్థాయిలో అన్నప్రాసనలు.
- 5నుంచి 6వ తేదీ వరకు గృహాలను సందర్శిస్తారు. ఆరు నెలల లోపు, 6నుంచి 24 నెలల వయసున్న పిల్లలకు తల్లి పాలిచ్చే విధానం, పోషకాహారం అందించే విధానం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారు.
- 7న స్వయం సహాయక బృందాల సహాయంతో పిల్లలు, మహిళల శ్రేయస్సు కోసం వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

వారోత్సవాలను విజయవంతం చేయాలి
బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని, ఆరు నెలల వరకు తల్లిపాలే పట్టించాలని జిల్లా సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారి జ్యోత్స్న పేర్కొన్నారు. మొదటి రోజు జిల్లా కేంద్రంలో నిర్వహించిన వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధమని, లేకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. తల్లిపాల ఆవశ్యతను తెలియజేసేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మందుల కొరత లేకుండా చూడాలి



మోటకొండూరు పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు



కూనూరులో ఇందిరమ్మ ఇంటికి ఉపయోగిస్తున్న ఇసుకను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ హనుమంతరావు

మోటకొండూర్: ఆస్పత్రుల్లో మందుల కొరత ఉండొద్దని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. కొరత ఉన్న మందులను వెంటనే ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మోటకొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది హాజరు రిజిస్టర్, రోగుల వివరాల నమోదు, కాన్పుల రికార్డులను పరిశీలించారు. వార్డుల్లోకి వెళ్లి రోగులతో మాట్లాడారు.ఆస్పత్రిలో సౌకర్యాలు, వైద్యసేవలు ఎలా ఉన్నాయని వారిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని డాక్టర్లను సూచించారు. ఆయన వెంట వైద్యులు విజయ్, మోసెస్ రాజ్, ఎస్‌ఐ అశోక్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన
భువనగిరి: మండలంలోని కూనూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ సామగ్రి ఏ రేట్లకు లభిస్తున్నాయని లబ్ధిదారులను అడిగారు. లబ్ధిదారులకు ఇబ్బందులు ఉంటే వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. మహిళా సంఘాల నుంచి రుణాలు ఇప్పించాలన్నారు. గ్రామానికి మంజూరైన ఇళ్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు.

బునాదిగాని కాల్వ విస్తరణకు సర్వే



కంచనపల్లి వద్ద సర్వే చేస్తున్న అధికారులు

వలిగొండ : మండలంలోని కంచనపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో బునాదిగాని కాల్వ విస్తరణకు శుక్రవారం నీటి పారుదల, రెవెన్యూ, అటవీ, ఉద్యానవన శాఖ అధికారులు సర్వే చేశారు.సేకరించాల్సిన భూముల వివరాలను సర్వే నంబర్ల వారీగా రైతుల సమక్షంలో పరిశీలించారు. కాలువ విస్తరణ వల్ల ఎదురయ్యే సమస్యలను రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు. బునాదిగాని కాలువ కోసం ఇప్పటికే రెండు పర్యాయాలు భూములు కోల్పోయామన్నారు. కంచనపల్లి గ్రామ పరిధిలో కాలువను అనుకున్నదానికంటే చాలా వెడల్పు తవ్వారని, పూర్తిస్థాయిలో నీళ్లురాని కాలువకు భూములు ఎందుకు ఇవ్వాలన్నారు. జీవనాధారమైన సాగు భూములను కోల్పోవాల్సి వస్తుందని వాపోయారు. కాలువ కోసం తొలగించిన కల్వర్టులను వెంటనే నిర్మాణం చేయాలని కోరారు. సర్వే పనులను భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఏఈ రవినాయక్, సర్వేయర్ బీక్యానాయక్, ఆర్‌ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి, ఉద్యానవన, అటవీ అధికారులు కవిత, ఆర్‌ఎస్‌ఎస్ నాయక్, రాపోలుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవ


అద్దాల మండపంలో అమ్మవారికి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి శుక్రవారం ఊంజలి సేవను పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సాయంత్రం వేళ అమ్మవారిని బంగారు ఆభరణాలు, వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సమయంలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలో అధిష్టించి ఊంజలి సేవ చేపట్టారు. ఇక ఆలయంలో నిత్య పూజలు యథావిధిగా కొనసాగాయి.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

- మరో ఇద్దరికి గాయాలు

డిండి: బైక్ అదుపుతప్పి యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి డిండి మండలం బొల్లనపల్లి గ్రామ స్టేజీ సమీపంలో జరిగింది. శుక్రవారం ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన లక్కు విజయభాస్కర్‌రెడ్డి(18), ఎం. సిద్దార్థరెడ్డి, ప్రకాష్‌రెడ్డి గురువారం శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకుని రాత్రి బైక్‌పై ముగ్గురు కలిసి నాగార్జునసాగర్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో డిండి మండలం బొల్లనపల్లి గ్రామ స్టేజీ సమీపంలో వీరి బైక్ అదుపుతప్పడంతో మధ్యలో కూర్చున్న విజయభాస్కర్‌రెడ్డి రోడ్డుపై పడి తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిన సిద్దార్థరెడ్డి, ప్రకాష్‌రెడ్డిని మెరుగైన చికిత్స నిమిత్తం దేవరకొండకు తరలించారు. శుక్రవారం దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం విజయభాస్కర్‌రెడ్డి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాగర్ సోయగాలు




నాగార్జునసాగర్: సాగర్ జలాశయం నిండుకుండలా మారి సరికొత్త అందాలను సంతరించుకుంది. ఐదురోజులుగా ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఈ దృశ్యాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. జలాశయంలో లాంచీల్లో విహరిస్తూ చుట్టూ పచ్చని ఎత్తైన కొండలను చూస్తూ నాగార్జునకొండకు వెళ్లడం పర్యాటకులకు మరుపురాని అనుభూతి. సాగర్ అందాలను చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటలకు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి వసతి, సాగర్ చుట్టుపక్కల దర్శనీయ ప్రదేశాలపై ప్రత్యేక కథనం..



చూసొద్దాం.. రండి

- ప్రపంచ పర్యాటక కేంద్రంగా నాగార్జునసాగర్
- చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచే నందికొండ, బుద్ధవనం, నాగార్జునకొండ మ్యూజియం
- చెప్పలేని అనుభూతిని మిగిల్చే లాంచీ విహారం

సాక్షి Weekend

నాగార్జున కొండ మ్యూజియం

నాగార్జునకొండ ప్రపంచలోనే రెండవ ఐలాండ్ మ్యూజియం. ఇక్కడకు హిల్ కాలనీ లాంచీ స్టేషన్ నుంచి 20కి.మీ. దూరం(గంట సమయం) కృష్ణా నదిలో ప్రయాణిస్తే చేరుకోవచ్చు. హిల్‌కాలనీ లాంచీ స్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లాంచీలు అందుబాటులో ఉంటాయి. లాంచీ టిక్కెట్ పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150. మ్యూజియం మాన్యుమెంట్ సందర్శనకు టిక్కెట్ రూ.30. 15 ఏళ్ల లోపు చిన్నారులకు ఉచితం. విజ్ఞాన యాత్రకు గ్రూపుగా వచ్చే విద్యార్థులకు లాంచీ టిక్కెట్‌పై 15శాతం రాయితీ ఉంటుంది.



బుద్ధవనం



సాగర్ జలాశయ తీరంలో 274 ఎకరాల్లో బుద్ధవనం నిర్మితమైంది. ప్రపంచంలోని బౌద్ధ దేశాలలో బుద్ధుడికి సంబంధించిన స్మృతులు బుద్ధవనంలోని మహాస్థూపం డోమ్‌పై చెక్కబడ్డాయి. సిద్ధార్థుడి జననం, బాల్యం, తదితర దశల్లో వ్యవహరించిన తీరు బుద్ధవనాన్ని సందర్శించి తెలుసుకోవచ్చు. బుద్ధవనం సందర్శనకు పెద్దలకు టికెట్ ధర రూ.100, పిల్లలకు రూ.50. ఇక్కడ ఐదు గదులు ఉన్నాయి. వీటిని అద్దెకు ఇస్తారు. ఏసీ గది రూ.1500, నాన్ ఏసీ గది రూ.1200 ఉంటుంది. ఇతర వివరాలకు 97058 15303 నంబర్‌ను సంప్రదించవచ్చును.

మనసు దోచే ఎత్తిపోతల



నాగార్జునసాగర్ నుంచి ఏపీలోని మాచర్లకు వెళ్లే దారిలో 14 కిలోమీటర్ల దూరంలో ఎత్తిపోతల జలపాతం ఉంది. చంద్రవంక వాగుపై సహజసిద్ధంగా ఏర్పడిన ఈ జలపాతం వద్ద 70 అడుగుల పైనుంచి జాలువారే నీటి దృశ్యం పర్యాటకుల మనస్సు దోచుకుంటుంది. ఈ జలపాతం చూసేందుకు టిక్కెట్ ధర పెద్దలకు రూ.30 కాగా పిల్లలకు రూ.20. ఇక్కడ పర్యాటకుల సౌకర్యార్థం రాత్రి బస చేసేందుకు 8 గదులు కూడా అందుబాటులో ఉన్నాయి.

గత ఆనవాళ్లకు చిరునామా అనుపు



హిల్‌కాలనీకి 15 కిలోమీటర్ల దూరంలో అనుపు పర్యాటక కేంద్రం ఉంది. ఇక్కడ అలనాటి నాగార్జున విశ్వవిద్యాయం, ఇక్ష్వాకుల యాంపీ స్టేడియం ఆనవాళ్లు ఉన్నాయి. కృష్ణా నది లోయలో లభించిన రంగనాథస్వామి ఆలయాన్ని అదే రాతితో అనుపులోని కృష్ణా నది తీరంలో నిర్మించడం విశేషం. తొలి ఏకాదశి పర్వదినాన ఇక్కడికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

ముఖ్యమైన ఫోన్ నంబర్లు

- హిల్‌కాలనీ లాంచీ స్టేషన్: 7997951023
- ఎత్తిపోతల : 9441453115, 9494347946
- విజయపురి నార్త్ ఎస్‌ఐ: 8712670197
- సాగర్ మాత దేవాలయం: 9581642488
- పైలాన్ కాలనీ టైగర్ వ్యాలీ హోటల్: 915439303
- పార్కింగ్ హోటల్ అండ్ రెస్టారెంట్: 7993750209
- విజయపురి సౌత్‌లోని మాతాసరోవర్ రిసార్ట్స్: 8500718552, 7901084959

పచ్చందాల అర్బన్ పార్కు



సాగర్ జలాశయ తీరంలో నాగార్జునసాగర్–హైదరాబాద్, సాగర్–నల్లగొండ రహదారుల (సమ్మక్క–సారక్కల) వెంట రూ.1.5కోట్లతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ వన్యప్రాణుల అటవీ కోర్ ఏరియాలో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు పచ్చందాలను ఆరబోస్తోంది. 980 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పార్కు ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతంలోని గుట్టల మధ్యన సాగర్ బ్యాక్ వాటర్ అందాలను తిలకించేందుకు నెల్లికల్లు అటవీ ప్రాంతంలో వ్యూ పాయింట్ ఏర్పాటు చేశారు. అటవీ అందాలను వీక్షించేందుకు రెండు రకాల సఫారీ వాహనాలను ఏర్పాటు చేశారు. వాహనంలో 10 కిలోమీటర్ల పరిధిలో పర్యటించేందుకు రూ.1,000, 24 కిలోమీటర్ల పరిధిలో పర్యటించేందుకు రూ.1500 వసూలు చేస్తున్నారు. సిబ్బంది కొరత మూలంగా పర్యాటకులు అడిగితేనే సఫారీ వాహనాలను నడుపుతున్నారు.

ప్రధాన జలవిద్యుత్ కేంద్రం



నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్ వే పక్కన ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ఉంటుంది. ఈ విద్యుత్ కేంద్రాన్ని సాగర్ జెన్‌కో సీఈ, ఎస్‌ఈల ప్రత్యేక అనుమతి తీసుకుని పర్యాటకులు సందర్శించాల్సి ఉంటుంది. విజ్ఞాన యాత్ర కోసం నాగార్జునసాగర్‌కు వచ్చే విద్యార్థులు ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించి నీటితో విద్యుదుత్పాదన చేసే విధానాన్ని వివరంగా తెలుసుకోవచ్చు.

సాగర్ మాత పుణ్యక్షేత్రం



విజయపురి సౌత్‌లోని కృష్ణా నది తీరంలో సాగర్ మాత దేవాలయానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు. భక్తుల కోరికలు తీర్చే తల్లిగా సాగర్ మాతకు పేరుంది. ఇక్కడ నెలకొల్పిన జపమాల క్షేత్రం తెలుగు రాష్ట్రాల్లోనే ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రతి ఏడాది మార్చి నెల మొదటి వారంలో మూడురోజుల పాటు సాగర్ మాత ఉత్సవాలు జరుగుతాయి.

ఆతిథ్యమిస్తున్న హోటళ్లు

నాగార్జునసాగర్‌లో పర్యాటకులకు అనుగుణంగా హోటళ్లు పెద్ద సంఖ్యలో వెలిశాయి. ప్రస్తుతం నాగార్జునసాగర్ పర్యాటకంగా అభివృద్ధి చెందుతుండటంతో వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగింది. దీంతో హోటల్ బిజినెస్ కూడా పెరిగింది. హిల్‌కాలనీలో విజయ్‌విహార్‌లో నడుస్తున్న హోటల్‌లో దేశ, విదేశీయులు తినే పలురకాల వంటకాలు లభ్యమవుతున్నాయి. అలాగే బుద్ధవనంలో సిద్ధార్థ హోటల్, మనోరమ హోటల్, పైలాన్‌కాలనీలో ఇటీవల ఏర్పాటైన టైగర్ వ్యాలీ హోటళ్లు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. కొత్త బ్రిడ్జి అవతలి వైపున ఉన్న మాతా సరోవర్, రైట్ బ్యాంకులో మాతా సరోవర్ హోటళ్లు వెలిశాయి. పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో హిల్‌కాలనీలో విజయ్‌విహార్ హోటల్‌లో 34 గదులు ఉన్నాయి. ముందస్తుగా ఆన్‌లైన్‌లో టీడీటీజీసీ.ఇన్ సైట్ ద్వారా బుక్ చేసుకోవాలి. వివరాలకు 08680–277362 నంబర్‌ను సంప్రదించాలి.



దుకాణాల పైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- మహిళకు తీవ్ర గాయాలు


ట్రాక్టర్ వద్ద గుమికూడిన స్థానికులు

ఆలేరు: డ్రైవర్ మద్యం మత్తులో ట్రాక్టర్ నడపడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆలేరు పట్టణంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణంలోని పెద్దవాగు నుంచి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఇసుక తరలించేందుకు జూకంటి సంపత్ ట్రాక్టర్‌కు తహసీల్దార్ ఆంజనేయులు పర్మిషన్ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం డ్రైవర్ కమల్‌హాసన్ వాగు వద్ద ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసుకుని కనకదుర్గ గుడి మార్గంలో ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్తున్నాడు. ఆర్‌కే సినిమా థియేటర్ వెళ్లే దారి సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న శ్రీలక్ష్మీనర్సింహ ఉడెన్ ఫర్నీచర్ వర్క్స్‌షాప్ పైకి దూసుకెళ్లింది. దీంతో షాపులోని వర్కర్లు బయటకు పరుగులు తీశారు. అదే సమయంలో బస్టాండ్ వైపు నడుచుకుంటూ వెళ్తున్న కొలనుపాకకు చెందిన వల్లెపు రాజమణిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఫర్నీచర్ షాపు ఎదుట పార్కింగ్ చేసిన స్కూటీ నుజ్జునుజ్జయ్యింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన మహిళను ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్‌ఐ తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌ను అరెస్టు చేశామని పేర్కొన్నారు. అయితే ఆలేరు నుంచి జనగామ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు రాంగ్‌రూట్‌లో ఎదురుగా రావడంతో అతడిని తప్పించే క్రమంలోనే ట్రాక్టర్ దుకాణాల పైకి దూసుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు తెలిపినట్లు సమాచారం.

పాఠశాల గోడ దూకి పారిపోయిన విద్యార్థి

- స్థానికులు గుర్తించి ఉపాధ్యాయులకు అప్పగింత

మోత్కూరు: మోత్కూరు ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల గోడ దూకి పారిపోయిన విద్యార్థిని స్థానికులు గుర్తించి స్కూల్ ఉపాధ్యాయులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. వివరాలు.. మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న దీక్షిత్ శుక్రవారం పాఠశాల గోడ దూకి పారిపోయాడు. స్థానిక చెరువు కట్ట వద్దకు చేరుకుని ఏడుస్తూ ఉండగా.. స్థానికులు అతడిని గమనించి వివరాలు అడిగారు. దీంతో అతడు 'ఫోన్ ఇవ్వండి.. మా అమ్మానాన్నలకు ఫోన్ చేయాలి' అని చెప్పడంతో వెంటనే స్కూల్ యజమాన్యానికి సమాచారం ఇచ్చారు. దీక్షిత్ వారి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా.. గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ కోమటి మత్స్యగిరి, దండ్ల కళ్యాణ్, భిక్షపతి, అన్నందాస్ వినయ్, సంజీవ వెంటనే స్పందించి బాలుడిని పట్టుకొని మంచి నీళ్లు తాగించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కొద్దిసేపటికే స్కూల్ ఉపాధ్యాయులు అక్కడికి చేరుకోవడంతో వారికి బాలుడిని అప్పగించారు. గురువారమే దీక్షిత్‌ను తండ్రి మల్లేష్ స్కూల్‌లో వదిలి వెళ్లాడని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ శారదను వివరణ కోరగా.. దీక్షిత్ మధ్యాహ్నం వంట చేసే సిబ్బందితో పాటు బయటకు వెళ్లాడని, టీచర్లు గుర్తించి స్కూల్‌కు తీసుకొచ్చారని పేర్కొన్నారు.

పోలీసులపై దాడి చేసిన యువకులపై కేసు

మునగాల: మునగాల మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై దాడికి పాల్పడిన యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండల కేంద్రానికి చెందిన రాము, ప్రదీప్, వీరబాబు, మణికంఠ, శివసాయి, మహేష్, నాగ గోపితో పాటు పలువురు యువకులు గురువారం రాత్రి ఘర్షణ పడుతుండగా.. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది బాలకృష్ణ, శ్రీనివాస్‌పై సదరు యువకులు రాళ్లు విసరడంతో కానిస్టేబుల్ బాలకృష్ణకు గాయాలయ్యాయి. బాలకృష్ణను చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి తరలించారు. మరో కానిస్టేబుల్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.